క్లుప్తంగా

చెత్తా,చెదారాల తొలగింపు



డివైడర్ మధ్యలో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న కార్మికులు

విజయనగరం: నగరంలోని ప్రధాన పార్కులు, డివైడర్ల మధ్య ఉన్న చెత్తా,చెదారాలను పారిశుధ్య సిబ్బంది తొలగిస్తున్నారు. అలాగే చెట్ల చుట్టూ పాదెలు తవ్వి ఏపుగా పెరిగేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే రాక్ గార్డెన్‌లో ఎండిపోయిన మొక్కలతో పాటు మహిళా పార్కులో గడ్డి మొక్కలను ఏరివేస్తున్నారు. అలాగే అచంట గార్డెన్, గాంధీ పార్కుల్లో కూడా కొద్ది రోజులుగా పారిశుధ్య పనులు చేపడుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

6ఏ కేసుల నమోదు

విజయనగరం రూరల్: మండలంలోని రాకోడు డిపో నంబర్ 80, గాజులరేగ డిపో నంబర్ 66 నిర్వాహకులపై 6ఏ కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ రామా రావు తెలిపారు. గురు వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రేషన్‌ను పక్కదారి పట్టించడంతో పాటు స్టాక్‌లో తేడాలు రావడంతో కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే మండలానికి 324 కొత్త రేషన్‌కార్డులు మంజూరయ్యాయన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

డెంకాడ: ఈ నెల 26న భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల విద్యావనరుల కేంద్రంలో భారత రాజ్యాంగ విశిష్టతపై గురువారం వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 8, 9, 10వ తరగతి విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఈనెల 22న జిల్లా స్థాయిలో మహారాజా సాంస్కృతిక పాఠశాలలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువుల వాహనం పట్టివేత

నెల్లిమర్ల: పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాన్ని పోలీసులు గురువారం సీజ్ చేశారు. గురువారం స్థానిక రామతీర్థం జంక్షన్ సమీపంలో పూడమ్మతల్లి గుడివద్ద ఎస్సై బి. గణేష్ వాహన తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో పశువులను తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి, బాధ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

పూసపాటిరేగ: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని భోగాపురం రూరల్ సీఐ డి.రామకృష్ణ అన్నారు. మండలంలోని కనిమెట్టలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, సెల్ ఫోన్ ద్వారా వచ్చే మెసేజీల ద్వారా ఎక్కువగా మోసాలు జరుగుతున్నాయన్నారు . గ్రామాలలో మాదకద్రవ్యాలు ఎవరు వినియోగించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఐ. దుర్గాప్రసాద్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన



పుస్తక ప్రదర్శనలో విద్యార్థులు

విజయనగరం అర్బన్: గాజులరేగ పరిధిలోని సీతం ఇంజినీరింగ్ కళాశాల గ్రంథాలయంలో గురువారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పుస్తకపఠనం జీవితకాల అభ్యాస ప్రాముఖ్యతను తెలియజేస్తుందన్నారు. పుస్తక పఠనం వల్ల విమర్శనాత్మక ధోరణి అలవడుతుందని చెప్పారు. పుస్తక ప్రదర్శనలో ఇంజినీరింగ్, కాంపిటేటివ్, గేట్, సాహిత్యం, ప్రాచీన పుస్తకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, గ్రంథాలయాధికారి డాక్టర్ ఎల్.సత్యవతి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు, పిల్లలకు రక్షణ కల్పించాలి..

విజయనగరం ఫూల్‌బాగ్: చట్టాలు కఠినంగా అమలు చేసి అత్యాచారాలు, హత్యలను నుంచి మహిళలు, పిల్లలను కాపాడాలని ఐద్వా, జేవీవీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. రెండో తరగతి విద్యార్థినిపై రిక్షా కార్మికుడు అత్యాచారానికి పాల్పడిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చిందన్నారు. రెండు రోజుల కిందట విశాఖలో విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగిందని తెలిపారు. ఇటువంటి సంఘటనలను ఖండిస్తూ ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ, నగర కార్యదర్శి వి. లక్ష్మి, జేవీవీ సమత రాష్ట్ర కన్వీనర్ ఎ. నిర్మల నగరంలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు.

- సారిపల్లిలో నమోదవుతున్న కొత్తకేసులు
- గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక వైద్య శిబిరం
- ఇంటింటా సర్వే చేపడుతున్న వైద్య సిబ్బంది

అమ్మో.. డయేరియా..!



సారిపల్లిలో రోగిని తనిఖీ చేస్తున్న వైద్య సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి గ్రామస్తులను డయేరియా పట్టిపీడిస్తోంది. నెల రోజుల నుంచి కేసులు ఒక్కొక్కటిగా నమోదవుతుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. సతివాడ పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించి సేవలందిస్తున్నా వ్యాధి అదుపులోకి రాకపోవడం వైద్య వర్గాలను విస్మయపరుస్తోంది. ఇప్పటి వరకు గ్రామానికి చెందిన 50 మంది పైబడి డయేరియా బారిన పడినట్లు స్థానికులు చెబుతున్నారు. కొందరు ప్రభుత్వాస్పత్రులు, మరికొందరు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వైద్యసిబ్బంది ఇంటింటా సర్వే చేపట్టి ఆరోగ్య జాగ్రత్తలు వివరిస్తున్నారు.

కలుషిత ఆహారమే కారణమా..?

గ్రామంలో ఇటీవల జరిగిన కార్తీక వనసమారాధన కార్యక్రమంలో కలుషిత ఆహారం తినడమే కొత్తగా డయేరియా కేసుల నమోదుకు కారణమని వైద్యాధికారులు చెబుతుండగా.. నెల రోజులుగా గ్రామంలో ఇదే పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ట్యాంకులతో తాగునీరు సరఫరా చేస్తున్నా.. పారిశుధ్య నిర్వహణ అంతంతమాత్రంగానే ఉందంటూ విమర్శిస్తున్నారు.

పరిస్థితి అదుపులోనే ఉంది..

గ్రామంలో డయేరియా వ్యాప్తి అదుపులోనే ఉంది. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రతిరోజు వైద్య శిబిరాన్ని కొనసాగిస్తున్నాం. డయేరియాతో బాధపడుతున్న వారంతా కోలుకున్నారు. కొత్త కేసులు నమోదు కాకుండా చర్యలు చేపట్టాం. ప్రజలు కూడా ఆహార, ఆరోగ్య సూత్రాలు పాటించాలి.

– డాక్టర్ సాయిరాం, వైద్యాధికారి, సతివాడ పీహెచ్‌సీ

అత్యాచార నిందితులను శిక్షించాలి



నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

విజయనగరం ఫూల్‌బాగ్: రోజురోజుకూ పెరిగిపోతున్న అత్యాచార సంఘటనలను నివారించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) విజయనగరం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన బాటపట్టారు. గురువారం స్థానిక విజయనగరం కాంప్లెక్స్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కోకన్వీనర్ భారతి మాట్లాడుతూ.. విశాఖలో లా విద్యార్థినిని ప్రేమ పేరుతో వంచించి అత్యాచారానికి పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అదుపు తప్పిన శాంతిభద్రతలను కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి. రాము, జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి పి. రమేష్, శిరీష , సోమేశ్, రాజు ,రాహుల్ , కుమార్ స్వామి, మురళి, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు పరిశీలన



గుణుపూరుపేట డంపింగ్‌యార్డ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్, తదితరులు

విజయనగరం: నగరంలో సేకరించిన చెత్తను తరలించే గుణుపూరుపేట డంపింగ్‌యార్డ్‌ను కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య గురువారం పరిశీలించారు. ప్రజారోగ్య, ఇంజినీరింగ్ విభాగాధికారులతో కలిసి వెళ్లి క్షేత్రస్థాయిలో జరుగుతున్న తడి, పొడి చెత్త వర్గీకరణ విధానంపై ఆరా తీశారు. విజయనగరం – కుమిలి రహదారిపైకి చెత్త రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంతకుముందు కమిషనర్ వివిధ ప్రాంతాలలో పర్యటించి పలు అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు. కోట ప్రాంతంలో బొంకులదిబ్బ మీద విక్రయాలు సాగిస్తున్న కూరగాయల వర్తకులతో మాట్లాడుతూ.. చెత్తాచెదారాలను ప్రధాన రహదారిపై వేయకుండా డస్ట్‌బిన్‌లలో వేయాలన్నారు. ఆ తర్వాత గుమ్చీ ప్రాంతంలో పర్యటించి అక్కడి కాలువ అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి, తక్షణమే కాలువను శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం రింగ్‌రోడ్‌లో పర్యటించి, పాలిథిన్ ఉత్పత్తులు వినియోగిస్తున్నదీ, లేనిదీ ఆరా తీశారు.

బాల్య వివాహాలు చేయడం నేరం

విజయనగరం ఫోర్ట్: బాల్య వివాహాలు చేయడానికి ప్రయత్నించినా, ప్రోత్సహించినా చర్యలు తప్పవని వన్‌స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ రొంగలి వెంకటలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక ధర్మపురి జిల్లా పరిషత ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ, ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే 1098 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బి.నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శివానందలహరి ప్రవచనాలు

నెల్లిమర్ల: పట్టణంలోని మిమ్స్ వైద్య కళాశాల సమీపంలో ఉన్న శ్రీరామకృష్ణ ధ్యాన మందిరంలో ఈ నెల 23 నుంచి 29 వరకు శివానందలహరి ప్రవచనాల కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జగద్గురువు శ్రీ ఆది శంకరాచార్యులు రచించిన శివానందలహరిపై విజయనగరం చిన్మయ మిషన్ ప్రతినిధి స్వామి విజయానంద సరస్వతి ప్రవచిస్తారు. ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ప్రవచనాల కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఈ నెల 30న ధ్యాన మందిరంలో సామూహిక ప్రత్యేక కార్తీక దీపారాధన కార్యక్రమం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామి వారి దివ్యాశీస్సులు పొందాలని నెల్లిమర్ల శ్రీరామకృష్ణ సేవా సమితి కార్యదర్శి టి. జగన్నాథరాజు కోరారు.

అసంఘటిత కార్మికులుగా గుర్తించాలి...

విజయనగరం టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం టీవీ టెక్నీషియన్లను లేబర్ యాక్ట్‌లో అసంఘటిత రంగ కార్మికులుగా చేర్చాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో స్టేట్ యూనియన్ పిలుపు మేరకు గురువారం ప్రపంచ టెలివిజన్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అన్ని వృత్తుల వారికి అందించే సహాయ, సహకారాలను టీవీ టెక్నీషియన్లకు అందించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు గోపాల్, యూనియన్ ప్రతినిధులు, సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ సదస్సు రేపు



శిక్షణ కార్యక్రమాల షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న వేదిక ప్రతినిధులు

విజయనగరం అర్బన్: ఈ నెల 23న స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో విద్యార్థులకు 'సామాజిక అవగాహన – జీవన నైపుణ్యాలు' అనే అంశంపై ఒక్క రోజు శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు జిల్లా విజ్ఞాన వేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్, రాష్ట్ర నాయకుడు డాక్టర్ పైల రమేష్‌రాజు తెలిపారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శిక్షణ తరగతుల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ప్రారంభోత్సవానికి జిల్లా జడ్జి బి.సాయికల్యాణ్ చక్రవర్తి, జిల్లా అదనపు జడ్జి కె.నాగమణి, ఎస్పీ వకుల్ జిందాల్, జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వేదిక నగర అధ్యక్షుడు శివాజీ, ప్రధాన కార్యదర్శి షణ్ముఖరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈశ్వరరావు పాల్గొన్నారు.

నెల్లిమర్లలో టీడీపీ వర్సెస్ జనసేన

- జనసేన నాయకులకు కేటాయించిన పనులు నిలిపివేయండి
- ఎంపీడీఓ , మండల ఇంజినీరింగ్ అధికారి ఎదుట టీడీపీ నాయకుల ఏకరువు



ఎంపీడీఓ రాధికతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పూసపాటిరేగ: మండల పరిధిలో వివిధ గ్రామాలలో జనసేన నాయకులకు కేటాయించిన ఉపాధిహామీ పథకంలో మంజూరైన పనులను తక్షణమే నిలిపివేయాలని కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాధిక, మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావును మాజీ ఎంపీపీ మహంతి చిన్నంనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు ఎంవీజీ శంకరరావుతో పాటు పలువురు టీడీపీ మాజీ సర్పంచ్‌లు, టీడీపీ నాయకులు కలిశారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి మిత్రధర్మాన్ని పాటించడం లేదని, ఎనభై శాతం ఉన్న టీడీపీ నాయకులను కాదని కేవలం 15 శాతం ఉన్న జనసేన నాయకులకు ప్రభుత్వం నుంచి మంజూరైన పనులు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కేటాయించిన పనులను తక్షణమే నిలిపివేయించాలని అధికారులను కోరారు. దీనికి అధికారులు స్పందిస్తూ పనులు నిలిపివేస్తామని హామీ ఇచ్చారు. గ్రామాలలో ప్రభుత్వ కార్యక్రమాలు జరిగినప్పుడు టీడీపీ కార్యకర్తలను ఆహ్వానించాలని అధికారులకు సూచించారు. అధికారులు ఎటువంటి పక్షపాత వైఖరి వహించినా సమాధానం చెప్పాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం ఏపీఓ రత్నమాల, వెలుగు ఏపీఎం అచ్యుతరావు, ప్రజాప్రతినిధులు ఆకిరి ప్రసాదరావు, పి. సన్యాసినాయుడు, విక్రం జగన్నాథంతో పాటు పలువురు టీడీపీ నాయకులున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

డెంకాడ: విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా మండలంలోని చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వహణ పనుల అనంతరం సరఫరా పునరుద్ధరిస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సతివాడ సబ్‌స్టేషన్ పరిధిలో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్నట్లు డీఈఈ పి. త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో అలుగోలు, కొత్తూరు, పల్లిపేట, జోగిరాజుపేట, గుషిణి, బర్లపేట, రాగోలు, సతివాడ, ఒమ్మి, బొప్పడాం, పినతరిమి, అంబేరేయగుళ్లు, బొద్దపేట, బుచ్చన్నపేట, ఆల్తిపాలెం , తమ్మాపురం, మల్యాడ, వెంకన్నపాలెం, వల్లూరు గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి..



విద్యుత్ సమస్యలపై చర్చిస్తున్న ఎంపీడీఓ రాధిక, తదితరులు

పూసపాటిరేగ: గ్రామాల్లో నెలకొంటున్న విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడే పరిష్కరించాలని ఎంపీడీఓ ఎం. రాధిక అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విద్యుత్‌శాఖ ఏఈ దేముడుతో మాట్లాడుతూ.. గ్రామాలలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సచివాలయం లైన్‌మన్‌లు గ్రామస్థాయిలో విధులు విస్మరించి విద్యుత్‌శాఖ పనులకే పరిమితం కావడంతో గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదని చెప్పారు. సచివాలయం లైన్‌మన్లను ఆయా గ్రామాలకే పరిమితం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పూసపాటిరేగ సర్పంచ్ టి. సీతారామ్, తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు అందుబాటులో ఉండాలి

నెల్లిమర్ల: నగర పంచాయతీలోని 20 వార్డులతో పాటు మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 23,24 తేదీల్లో బీఎల్‌ఓలు అందరూ తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని తహసీల్దార్ బి. సుదర్శనరావు, ఎన్నికల డీటీ వీవీఆర్ జగన్నాథరావు గురువారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఆయా రోజుల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బీఎల్‌ఓలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని, అలా అందుబాటులో ఉండని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే సవరణ కోసం దరఖాస్తులు స్వీకరించాలన్నారు.

24న వెలమ సమారాధన



సమావేశంలో మాట్లాడుతున్న వరప్రసాద్

విజయనగరం ఫోర్ట్: ఈ నెల 24న విజయనగరం పట్టణంలోని జేఎన్‌టీయూ వద్దనున్న మంచుకొండ వారి మామిడితోటలో కొప్పల వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహించనున్నట్లు కొప్పల వెలమ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు బొత్స వరప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక సంఘ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉన్న బీసీ వెలమలందరూ (కొప్పల వెలమ, పోలినాటి వెలమ) కుటుంబ సమేతంగా హాజరుకావాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు సీర సత్యనారాయణ, చలుమూరి వెంకటరావు, బోకం మురళీధర్, ఏగిరెడ్డి నరేంద్ర, వేమలి చైతన్యబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త బొద్దు విజయరామయ్య అన్నారు. మండలంలోని నక్కానపేటలో షిర్డీసాయి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తోటి వారికి సహాయపడాలనే తపన ప్రతి ఒక్కరిలో ఉండాలని సూచించారు. –పూసపాటిరేగ

నగర అభివృద్ధికి సహకరించాలి..



ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో నగర అభివృద్ధికి సహకరించాలని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి కోరారు. నగరపాలక సంస్థ అధికారులు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లతో కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు తమ డివిజన్ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. అందరి సహకారంతో నగరాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. – విజయనగరం

పనితీరులో మార్పు రావాలి..



ప్రజారోగ్య సిబ్బంది పనితీరులో మార్పు రావాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజారోగ్య పర్యవేక్షకులు, మేస్త్రీలు, శానిటరీ కార్యదర్శులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో ఖాళీ స్థలాలు డంపింగ్ యార్డ్‌లుగా తయారవుతున్నాయని, వాటిని ఎప్పటికప్పుడు ప్రక్షాళన చేసి శుభ్రపరచాలని చెప్పారు. ఖాళీ స్థలాల యజమానులతోనే పరిశుభ్రత కార్యక్రమాలు చేయించాలని తెలిపారు. కాలువలపై పలకలు వేయడం వల్ల మురుగు తీయలేకపోతున్నారని, అటువంటి వారిని చైతన్యపరచి పలకలు తీయించాలని సూచించారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ శతశాతం జరగాలన్నారు. ఎక్కడా ఆక్రమణలకు తావు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం

వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌కు ప్లాస్టిక్ ఉత్పత్తులు



స్వాధీనం చేసుకున్న నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను తరలిస్తున్న కార్మికులు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్‌లో కొన్ని రోజులుగా వివిధ ప్లాస్టిక్ షాపులపై దాడులు నిర్వహించి, స్వాధీనం చేసుకున్న నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌కు గురువారం తరలించారు. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాల మేరకు ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్న 1100 కిలోల నిషేధిత ప్లాస్టిక్ సామాగ్రిని విశాఖలోని ప్లాంట్‌కు పంపించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నంలో ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రజలు కూడా క్యారీ బ్యాగులు వంటివి వాడకుండా గుడ్డ సంచులు వినియోగించుకోవాలని సూచించారు.

నగరంలో వార్డు పర్యటనలు



వార్డు పర్యటనలో పాల్గొన్న అసిస్టెంట్ కమిషనర్, స్థానిక కార్పొరేటర్లు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో క్షేత్ర స్థాయి సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు నిర్వహించే వార్డు పర్యటనలు పునఃప్రారంభమయ్యాయి. ఈ మేరకు నగరంలోని 15వ డివిజన్‌లో గురువారం నిర్వహించిన వార్డు పర్యటనలో అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు పాల్గొన్నారు. చిన్నపల్లి వీధి, పెద్దపల్లి వీధి, తెలకల వీధి, రామ మందిరం, తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు మాట్లాడుతూ .. కలెక్టర్ ఆదేశాలతో ప్రతి గురువారం వార్డు పర్యటన చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా గుర్తించిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అల్లు చాణక్య, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టీపీఆర్ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏటీ అగ్రహారంలో గ్రామసందర్శన



రేషన్ డిపోను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణరాజు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఆత్మారాముని అగ్రహారంలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు తన సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థాయి సిబ్బంది పనితీరు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, క్లోరినేషన్, విద్యుత్ సరఫరా వంటి సేవలపై ఆరా తీశారు. సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, రేషన్ డిపో, ప్రభుత్వ పాఠశాలను సందర్శించి అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. స్థానిక పెద్దలు తారకరామతీర్థ ముంపు నిర్వాసితుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ శంకరజగన్నాథం, ఏపీఓ అరుణకుమారి, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ పవన్, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.